# పాపం... సుబ్బారాయుడు!



డిస్పెన్సరీ మూసేయబోతుండగా వగరుస్తూవచ్చాడు సుబ్బారాయుడు.

అలా రొప్పుతూ, రోజుతూ రావడం చూస్తే పరిగెత్తుకు వచ్చాడేమోననిపిస్తుంది. అసలు ఆ పేరు, గణపతి అంశతో వున్న ఆ రూపం, అన్నిటిని మించి ఆ అమాయకత్వం- ఇవన్నీ డాక్టర్ అశ్వనీకుమార్‌కి సుబ్బారాయుడంటే ఒక విధమైన ఆకర్షణ, తెలియని అభిమానంతో కూడిన జాలిని కల్పించాయి.

అతన్ని చూస్తూనే- "ఏమిటి సుబ్బారాయుడూ... హడావుడిగా వచ్చావు?" అని అడిగాడు, వెళ్లాలని లేచినవాడు తిరిగి కూర్చుంటూ.

"లాభం లేదండీ డాక్టర్‌గారూ... ఇంక మీరే ఏదైనా మంచి మందివ్వాలి" అన్నాడు సుబ్బారాయుడు సీరియస్‌గా.

"మందా! ఎవరికి? అసలు ఏమైంది..?" అన్నాడు డాక్టర్ కొంచెం ఆందోళనగా.

"మాకేనండీ... మాకు ఇంక పిల్లలు పుట్టకుండా మంచి మందియ్యాలండి!" అన్నాడు సుబ్బారాయుడు- గంభీరంగా ముఖంపెట్టి.

'కుటుంబ నియంత్రణ ప్రచారం అతని బుర్రకి బాగా ఎక్కినట్టుంది. ఇంట్లో పిల్లలతో బాగా బాధపడ్తుండి ఉంటాడు. ఈ మానవుడు ఈ మాత్రం దానికి ఇంత కంగారుగా వచ్చాడేమిటి?' అని మనసులోనే అనుకొని, సుబ్బారాయుడు సంగతి తెలిసినవాడు కనుక-

"చూడు సుబ్బారాయుడూ... దంపతులలో ఎవరు సరియైన పద్ధతులు పాటించినా పిల్లలు పుట్టకుండా చూసుకోవచ్చు. ఈ పద్ధతులు ఆడవారికంటే మగవారికి సులువు కనుక మీరు వాసెక్టమీ ఆపరేషన్ చేయించుకోండి" అన్నాడు డాక్టర్ అశ్వనీకుమార్.

"చేయించుకున్నానండీ..! అయినా- పిల్లలు పుట్తూనే ఉన్నారు"

డాక్టర్ ఒక్కక్షణం ఆశ్చర్యపోయాడు.

వాసెక్టమీలో ఫెయిలైన కేసులు ఎన్నో ఉన్నాయి. బహుశా ఇతనికి కూడా అలాగే జరిగివుంటుంది- అనుకొని "పోనీ, నిరోధ్ వాడండి, చాలా సులువు కూడాను" అన్నాడు.

"అదీ వాడానండీ, అయినా ఫలితం ఉండడం లేదు" అన్నాడతడు దిగులుగా.

అతను వాడిన నిరోధ్‌లలో మాన్యుఫాక్చరింగ్ డిఫెక్ట్స్ ఉండవచ్చుననుకుని, "అయితే ఈ మాత్రలు వాడండి" అంటూ ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు.

ఆ కాగితం చూస్తూనే "ఇవికూడా వాడాను డాక్టర్ గారూ, అయినా లాభం ఉండడం లేదు" అంటూ తల పట్టుకున్నాడు రాయుడు.

ఆ విధంగా చెప్పిన ప్రతీదీ ఆచరించానని చెప్తుండడంతో- డాక్టర్‌కి విసుగువేసింది.

"అయితే మీరు చేయాల్సింది ఒక్కటే! మీ ఆవిడ ఆలనాపాలనా ఎవరికైనా అప్పజెప్పి, మీరు ఆవిడకి దూరంగా ఉండండి" అన్నాడు.

"అదికూడా చేస్తున్నానండి. మా ఆవిడ ఆలనాపాలనా మా పక్కవాటా పరంధామయ్యే చూసుకుంటున్నాడు. నేను అసలు మా ఆవిడ దగ్గరికి పోవడమే లేదు. దూరంగానే ఉంటున్నాను. అయినా పిల్లలు పుట్తూనే ఉన్నారు" అన్నాడు సుబ్బారాయుడు దీనంగా.

అంతే... డాక్టర్ అశ్వనీకుమార్ నోరు అలానే తెరుచుకొని ఉండిపోయాడు.

– విశ్వ రచన పక్ష పత్రిక... *16 ఫిబ్రవరి '99*